# గ్రూప్ ఫోటో

"అబ్బే, మైసూరుపాకంటే నాకు సరిపడదు" అంటారు కొందరు. "ఒద్దు బాబూ! పద్యకావ్యాలంటే నాకు తలనొప్పి" అంటారు మరికొందరు. సినిమాలంటే తమకసహ్యమని చెప్పుకునేవాళ్ళు గూడా మనకు తారసపడుతుంటారు. కానీ కోదండం మాత్రం అతనివంటివాడు అతడొక్కడేనేమో నన్నంత విచిత్ర వ్యక్తిగా కనిపిస్తాడు.

మూక ఉమ్మడిగా మొత్తం మానవజాతిపైనే వెగటు కోదండానికి. ఇది నేను పెద్దగా పరిశోధించి తెలుసుకున్న విషయమేమీ కాదు. బహిరంగంగా కుండబద్దలు కొట్టినట్టు "నాకు మనుషులంటే గిట్టదండీ మేష్టరుగారూ!" అంటూ ఆముదం త్రాగినవాడిలా ముఖం చిట్లించుకుంటాడు కోదండం!

కోదండం సర్వేయరుగా మా ఊరి కొచ్చాడు. మా ఇంటి ప్రక్కనే ఓ వాటా ఖాళీగా ఉండడంతో అందులో చేరి స్థిరపడ్డాడు. ఊళ్ళోవున్న నాలుగైదింటిలోనూ ఒక మంచి హోటలు ఎన్నుకున్నాడు. ఈ ఎన్నుకోడం గూడా ఒకరి సలహాపైన ఆధారపడిగాదు. స్వయంగా తన నోటికీ చేతికీ జరిగిన పందెంద్వారా కోదండం ఆయాహోటళ్ళ ప్రాశస్త్యాన్ని లెక్కగట్టాడు.

పట్టుకుంటే నున్నగా జారిపోయే పొట్లకాయలాంటి అంగసౌష్టవం కోదండంది! చూపులకతడు ముప్ఫైయేళ్ళవాడిలా కనిపిస్తాడు. బహుశా ఒకటి రెండేళ్ళు తక్కువైతే కావచ్చు. ఇరుగుపొరుగు వాళ్ళందరూ అతడు వివాహితుడనీ, పెళ్ళాం పుట్టింట్లో వుంటుందనీ భావించారు. కొందరైతే అతడమ్మాయినెప్పుడు తీసుకురాబోతున్నాడని ఆరా తీయడానికి ప్రయత్నించారు గూడా! "చూచారా మేష్టరుగారూ! రజ్జు సర్పభ్రాంతి అంటే యిదేగావచ్చు. నేనేమో అవివాహితుణ్ణి. బెండకాయ ముదిరిపోతున్నదంటారేమో! పోనివ్వండి ఫరవాలేదు. 'సత్రంలో భోజనం మఠంలో నిద్ర'గా ఇప్పుడు బ్రతుకు హాయిగా గడచిపోతోంది. ఇలా ఉండిపోకుండా మెడకొక గుదిబండకట్టుకుని అంగడి బియ్యంతో తంగేడు కట్టెలతో సంసార సాగరాన్ని ఈదడం నావల్లనయ్యేపనిగాదు" అనేవాడు కోదండం.

కాదు గూడదని మంగళస్నానాలు చేయించి, మధుపర్కాలు కట్టబెట్టి అతణ్ణి పెళ్ళి పీటలపైన కూర్చోబెట్టాలన్న శ్రద్ధ ఎవ్వరికీ కలుగలేదుగానీ, కోదండం కోరికోరి సంపాదించుకొంటున్న ఒంటరితనం మాత్రం మాకందరికీ విస్మయాన్నే కలిగించింది.

ఉదయం బాగా ప్రొద్దెక్కిన తర్వాతగానీ నిద్రలేచేవాడుగాదు కోదండం. లేవగానే కాలకృత్యాలు నెరవేర్చి, ఉపాహారం ముగించి కూలీని వెంటబెట్టుకుని పొలాలపైకి వెళ్ళిపోతే సూర్యుడు నడిమింటి కొచ్చేసరికి తిరిగొచ్చేవాడు. ఇక మధ్యాహ్న భోజనానంతరం ఒకటి రెండు గంటలపాటు నిద్ర తప్పనిసరి! ఆ తర్వాత ప్రొద్దు గూటిలో పడేదాకా ఉదయం భూముల్ని కొలిచి గుర్తించుకొచ్చిన లెక్కల ప్రకారం ప్లానులు గీస్తూ కూర్చునేవాడు. ఏ కారణంవల్లనైతేనేమి, కోదండానికి అర్ధరాత్రిదాకా నిద్రపట్టేదిగాదు. అప్పుడతడు తలుపుగడియ పెట్టుకుని, వెచ్చగా శాలువా కప్పుకుని 'శ్రీపార్వతీపుత్ర, లోకత్రయస్తోత్ర' అంటూ చిన్నప్పుడు నేర్చుకున్న దండకాలైనా ముదలంకించుకునేవాడు. లేదా సైకిలు తీసుకుని మూడు మైళ్ళ దూరంలో వున్న పట్టణానికి వెళ్ళిపోయి సినిమా

మూలంగానో, నాటకం మూలంగానో కాస్త వినోదం సేవించి ఏ పదకొండుకో పన్నెండుకో ఇల్లు చేరుకునేవాడు.

కోదండం గదిలో పన్నెండు ఛాయాచిత్రాలు వ్రేలాడుతుండేవి. ఒక ఫోటోలో ఏవో తీయని తలుపులు మదిలో మెదలుతున్న వాడిలా ముఖానికి మెరుగులు దిద్దుతున్న మందస్మితంతో ప్రత్యక్షమయ్యే కోదండం మరొక ఫోటోలో నాలుగంగుళాల నల్లటి బిరుసు గడ్డంతో గూర్ఖాసిపాయిలా కనిపిస్తాడు. ఒక పటంలో చిన్న గుట్టపైన బుద్ధ విగ్రహంలా కూర్చున్న కోదండం మరొక పటంలో బ్యాటు చేతబట్టుకుని టెన్నిస్ కోర్టుకు బయల్దేరుతుంటాడు. చిత్రమేమిటంటే, ఏ చిత్రంలో చూచినా మనకు దృగ్గోచరమయ్యేవాడు ఒక్క కోదండం మాత్రమే! కారణాంతరాలవల్ల తన అనుదిన కార్యక్రమాలకు అంతరాయం వాటిల్లి తీరిక దొరికినప్పుడు కోదండం ఆ ఫోటోలో దేనినైనా చేతికి తీసుకుని, తన ఆకృతిని చూచుకుని మురిసిపోతూ అశ్రమంగా కాలాన్ని దొర్లించగలిగేవాడు.

'ఏ వూరని నను వివరమడిగితే ఏమని తెలుపుదు లోకులకు' అన్న బ్రహ్మంగారి భక్తుడేమో కోదండం! కనీసం తన స్వగ్రామమేదన్న మామూలు విషయంగూడా బయటికి పొక్కకుండా అతడు జాగ్రత్తపడేవాడు. అంతగా ఉండబట్టలేక ఎవరైనా అడిగితే, ఒకసారి విశాఖ జిల్లాలో వియ్యన్నవారి పాలెమనీ, మరొకసారి నెల్లూరు జిల్లాలో ఉలవపాడనీ, ఇంకొకసారి కడప దగ్గర సిద్ధవటమనీ ఒకసారి చెప్పినట్లు ఒకసారి చెప్పకుండా పిల్లి తన కూనల్ని తిప్పినట్టు, అతడు తన స్వగ్రామాన్ని ఆంధ్రరాష్ట్రం నలుమూలలకు తిప్పేవాడు!

కోదండంతో నాకున్న పరిచయం గనుక ఒక మెట్టుపైకెక్కి స్నేహంగా పరిణమించివుంటే, నేనతణ్ణి గురించి మరికొన్ని వివరాలు సేకరించగలిగివుండేవాణ్ణి! కానీ కోదండం ధోరణి స్నేహం పెంపొందడానికి కాదు గదా, ఉన్న పరిచయం గూడా సన్నగిల్లిపోవడానికే తోడ్పడింది. "ఈ స్నేహితులనబడే వాళ్ళున్నారు చూచారా మేష్టరుగారూ! నిజం చెప్పొద్దూ, వీళ్ళకంటే జలగలే నయం! మీరు మీరు అంటూ దగ్గరికొస్తారు. నాలుగు రోజులకల్లా నువ్వు నువ్వు అంటూ భుజాలపైన చేతులు వేసుకుంటారు. చూస్తూ చూస్తూ వుండగానే ఒరేయ్ కాడికొస్తుంది కథ! ముదిరినకొద్దీ కుక్కమూతి పిందెలు వేసేదేమిటంటే స్నేహితమని తటపటాయించకుండా జవాబు చెప్పవచ్చు. ఎందుకంటారా! 'ఇదిగోరా బాబూ, నీ జేబులో అయిదు రూపాయలుంటే తీసుకెళ్తున్నాను' అంటాడొకడు. కాలం గడిచినకొద్దీ ఆ మాత్రం మాటగూడా ఉండదు. అందుకే నాకు స్నేహితులంటే ఒళ్ళుమంట! మీరు కాబట్టి లోపలికైనా రానిచ్చాను; మరెవరైనా సరే వచ్చిన పనేమిటో తెలుసుకుని ద్వారం దగ్గర నుంచే సాగనంపడానికి ప్రయత్నిస్తాను."

తెర తీయగానే మూలవిరాట్టు ప్రత్యక్షమైనట్టుగా నా కప్పుడు కోదండం నిజస్వరూపమేమిటో అవగతమైంది. స్నేహితుడంటూ ఒక దేర్పడితే అతడెప్పుడో ఒకప్పుడు తన సహాయాన్ని అర్థించకపోడని కోదండం ఉద్దేశం! అసలు స్నేహితుడే లేకపోతే తన కెలాటి బాదర బందీగానీ ఉండదని అతడి నమ్మకం. పోగా, తన జీవితకాలంలో తన కొకరి సహాయంతో అవసరం కలుగబోదన్నదే అతడి ధీమా!

బంధువుల గాలి చొరబడడానికిగానీ, స్నేహితుల పొలకువ సోకడానికిగానీ వీల్లేకుండా ఒక చిన్న ప్రపంచాన్ని సృష్టించుకోగలిగాడు కోదండం! ఆ ప్రపంచంలో కోదండాన్ని యథేచ్ఛగా విహరించుకోనిచ్చి నే నంతటితో అతణ్ణి గురించి పట్టించుకోడం మానేశాను.

* * *

వర్షాకాలం జరుగుతోంది. ఓ రోజు సాయంత్రం ఆకాశాన మబ్బులు దట్టంగా అలముకున్నాయి. మసకచీకటిని చీల్చుకుంటూ వచ్చి సూదుల్లా పొడుచుకుంటున్న వానచినుకుల బారినుండి తప్పించుకోదలచి వడివడిగా వీధిమెట్లెక్కుతున్నాను.

"బాబుగారూ!" వెనుకవైపునుంచి పిలుపు వినిపించింది.

తిరిగి చూచాను. కోదండం గది ముంగిట ఇదివరకెప్పుడూ కనిపించని మానవాకారం ఒకటి కనిపించింది.

"మా కోదండం ఎక్కడికి వెళ్ళాడో చెప్పగలరా బాబూ?"

'మా కోదండం!' కోదండాన్ని తమవాడని చెప్పుకోగలిగిన మానవ మాత్రుడొకడు యింతకాలాని కిలా వూడిపడినందుకు నాకు కాస్త ఆశ్చర్యం కలిగిన మాట వాస్తవం. ఆశ్చర్యంతోబాటు నాకు కోదండం పట్ల జాలిగూడా కలిగింది. స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు తప్పదన్నట్లు ఎంతో గుట్టుగా అజ్ఞాతవాసం నెరపుతున్న కోదండానికి ఇక్కడగూడా బంధువుల బెడద తప్పదు గాబోలు!...

"కోదండం మీ కేమౌతాడు?" ప్రశ్నించాను.

"మా అబ్బాయే బాబూ! వీడు మూడోవాడు. పెద్దవాళ్ళిద్దరూ ఇంటిదగ్గరే వుండి సేద్యం నాద్యం చూచుకుంటున్నారు. వీ డొక్కడు మాత్రం యిలా ఉద్యోగ ముద్యోగమంటూ ఊళ్ళు తిరుగుతున్నాడు. ఇంతేకాదులెండి, వీణ్ణి గురించి ఇంకా చాలా సంగతులు చెప్పాలి..." అంటూ ఆ ముసలాయన వానలో తడుస్తూ మా ఇంటి వసారాలోకి వచ్చేశాడు.

జరాభారంతో కృంగిపోయిన శరీరం, బట్టగట్టిన తల, బోసినోరు, పాతకాలంనాటి కోటు, ఓ నాలుగు మూళ్ళ పంచ - ఇదీ ఆయన వేషం. బస్సుఛార్జీల క్రింద పాతిక రూపాయలు వెచ్చించి ఐదారూళ్ళు తిరిగినమీదట కోదండం యిక్కడున్నాడన్న సంగతి తనకు తెలిసివచ్చిందని చెప్పి వేడిగా నిట్టూర్చాడు. మరేంచేస్తాడు పాపం, కోదండానికి బొత్తిగా జాబులు వ్రాసే అలవాటు లేదు. రెండు మూడేళ్ళ కొక్కసారైనా స్వగ్రామానికి వెళ్ళడు. మరి తనేమో ఆరుమాసాల కొకూరు చొప్పున బదిలీ అయిపోతుంటాడు!

"నా చేతిమీదుగా అయిదు పెళ్ళిళ్ళు చేశాను బాబూ! ఇద్దరు కొడుకులు ముగ్గురు కూతుళ్ళు లక్షణంగా కాపురాలు చేసుకుంటున్నారు. ఇంక వీడొక్కడున్నాడు. ఉండి ఏం లాభం? ఒంటిమేసినగిత్త రెంటమేయదన్నట్టుగా వీడికి మనిషి పొడంటే గిట్టదు. సంపాదించి మాకు పెట్టకపోతే మానె, పెళ్ళిచేసుకుని నువ్వు సుఖపడరా బాబూ అంటే ఆ మాట వినిపించుకోడు. శక్తి ఉడిగిన ఈ వృద్ధాప్యంలో బంధువులందరూ ఒక పందిరి క్రింద తిరుగుతుంటే కళ్ళజూడాలని కోరిక. చివరిసారిగా వీడినొకమాట అడిగి పెళ్ళి చేసుకుంటాడో, చేసుకోడో తెల్సుకోవాలనే యింత దూరం వచ్చాను..."

మంచి పనే చేశావులెమ్మని ఆ వృద్ధుడి అభిప్రాయాన్ని బలపరచి "కోదండం బహుశా టౌనుకు వెళ్ళివుంటాడు. రాత్రికి మీరిక్కడే భోజనం చేసి పడుకోండి" అన్నాను.

* * *

అర్ధరాత్రికల్లా ఇల్లు చేరుకోవలసిన కోదండం మరునాటి ఉదయం భళ్ళున తెల్లవారిన తర్వాత గూడా తిరిగి రాకపోయినందుకు నా మట్టుకు నేనే కాస్త రిచ్చపాటుకు లోనయ్యాను. ఇక కోదండం తండ్రి సంగతి సరేసరి. ఆయన రెప్పపాటు లేని కళ్ళతో రోడ్డువైపు చూస్తూ కూర్చున్నాడు.

మరికొంత సేపటికి కోదండం యింటికి తిరిగివచ్చే పరిస్థితిలో లేడన్న దుర్వార్త శరవేగంతోవచ్చి క్షణాల్లో ఊరంతా ప్రాకిపోయింది.

జరిగిన విషయం యిది – అర్ధరాత్రప్పుడెప్పుడో కోదండం సైకిలు పైన ఇంటికి తిరిగొస్తున్నాడు. చుట్టూరా చిమ్మచీకటి. పైన నల్లటి గుడారం లాంటి ఆకాశం. అప్పటికే మట్టిబాట అదుసుదున్ని పెట్టిన మడిలా తయారైంది. ఇన్నింటికీ పైగా సైకిలు నేలపైన గాకుండా గాలిలోనే పరుగెత్తాలన్న మిడిమేలమొకటి కోదండానికి! తెల్లవారుజామున కూరగాయల గంపలెత్తుకుని పట్టణానికి వెళ్తున్న పల్లెటూరివాళ్లకు రోడ్డుకు నాలుగైదు బారల దూరంలో విరిగిపోయిన రెండు విడి భాగాలకు అల్లంత దూరంలో రాళ్ళకు ఢీకొని నుజ్జుగుజ్జయిన శరీరంతో, నెత్తురు మరకల్లో ఎరుపు తిరిగిన పచ్చికపైన కోదండం బాహ్యస్మృతి లేకుండా పడివున్నాడు.

వర్తమానం తెలియుగానే కోదండం తండ్రి మిన్నువిరిగి మీదపడినట్టు నిర్ఘాంతపడిపోయాడు. వెన్ను విరిగిపోయినవాడిలా పైకి లేవలేకపోయాడు.

కానీ పైకి లేపగల్గినవాళ్ళు, లేచి ఆపత్సమయంలో ఆదుకోగలిగిన వాళ్ళు గ్రామంలో లేకపోలేదు. విన్నవాళ్ళు విన్నట్టే పరుగుతీశారు. ఇంత మందిలో బండి కట్టించుకొచ్చిందెవరో నాకు తెలియదు. నలుగురమూ కలిసి కోదండం భౌతిక కాయాన్ని బండిలోపలికి చేరవేశాము. బండి ఇంటి దగ్గర నిలిచేసరికి స్థానికులైన డాక్టరుగారు కూడా మందుల సంచితో హాజరయ్యాడు.

గదిలోపలినుంచి అందరినీ బయటికి పొమ్మని డాక్టరుగారు పదిపదిహేను నిమిషాలపాటు కోదండం పరిస్థితిని పరిశీలించి చూచారు. ఆయన నోటివెంట రాబోతున్న మాటకోసం నిరీక్షిస్తూ వందలకొలది గ్రామస్తులు వీధిలో తచ్చాడుతున్నారు.

చేయగలిగిందంతా చేశారుగానీ డాక్టరుగారు ప్రాణానికి మాత్రం పూచీ పడలేకపోయారు. "రక్తం విపరీతంగా నష్టమైపోయింది. రెండు మూడు చోట్ల ఎముకలు గూడా విరిగిపోయినట్టున్నాయి. గుండె చాలా నీరసంగా పనిచేస్తోంది. నేనొక ఇంజక్షను చేశాను. కానీ యింతటితో ఊరుకోడానికి యిది మామూలు కేసుగాదు. తక్షణం ఎవరైనా పట్టణానికి వెళ్ళి డాక్టరు ధర్మారావుగారిని పిలుచుకు రాగలిగితే మంచిది. ఎవరు వెళ్తారు?" అని ప్రశ్నిస్తూ ఆయన అరుగుపైన కూర్చున్నారు.

నేనంటే నేనని పదిమంది ముందుకొచ్చారు.

"వెళ్ళండి బాబూ! మీకు పుణ్యముంటుంది. డబ్బెంతైనా సరే నేనిచ్చుకుంటాను" అంటూ చేతులు జోడించి ఆక్రోశించాడు కోదండం తండ్రి.

డాక్టరు ధర్మారావుగారి కోసమేగాక, కోదండం బంధువులకోసంగూడా మనుషులు బయల్దేరారు. "మాది మారుమూల కుగ్రామం నాయనా! మీరు తంతియిచ్చినా లాభంలేదు. అది నాలుగు రోజులకుగానీ వెళ్ళదు. అంతకంటే మనుషులు వెళ్ళడమే నయం. సాయంత్రానికి వెళ్ళిపోవచ్చు" అన్నాడు కోదండం తండ్రి.

డిస్పెన్సరీలో పనులన్నీ ముగిసిన తర్వాతగానీ బయటకు కదలడానికి వీల్లేకపోనడంవల్ల డాక్టరు ధర్మారావు గారంత తొందరగా రాలేకపోయారు. వచ్చిన తర్వాత ఆయనకు గూడా ఇప్పుడిక చేయగలిగిందేమీ లేదేమోనన్న సంశయమే ఎదురైంది. ఐనా ప్రయత్నలోపం లేకుండా ఆయన వచ్చిన క్షణం నుంచీ చికిత్స ప్రారంభం చేశారు.

విరిగిన ఎముకలను పొందించి కట్లుకట్టి శరీరం వేడి ఎక్కడానికి సూదులు వేసి. బలవంతంగా నోరు తెరిచి మందులు పోసి డాక్టర్లిద్దరూ చేతులు కడుక్కునేసరికి ప్రొద్దుగ్రుంకి పోవచ్చింది.

"ఊరు ఊరంతా ఇక్కడెందుకూ? అందరూ వెళ్ళండి. మా పాట్లేవో మేము పడుతున్నాంగదూ!" అన్నారు డాక్టరు ధర్మారావుగారు.

డాక్టరుగారి సూచనప్రకారం వెళ్ళినవాళ్ళు వెళ్ళారు. మిగిలినవాళ్ళు అక్కడే కూర్చుని చెట్లపైనుంచి పడినవాళ్ళను గురించీ, సంఘ మరణాలను గురించీ మాట్లాడుకోసాగారు. ఇంతలో ఇళ్ళకు వెళ్ళినవాళ్ళు గూడా భోజనాలు ముగించి మళ్ళీ రచ్చపట్టువైపు రాసాగారు. ఇక్కడిలా జనం పలచబడక మునుపే కోదండం బంధువులు ప్రత్యేకంగా మాట్లాడుకున్న వ్యానులో వచ్చి, బిలబిలా ఇంటిముంగిట దిగేశారు.

కోదండం ఇంకా సజీవుడేనని చెబుతున్న వినకుండా నెత్తీనోరు బాదుకుంటూ వాళ్ళొకవైపున రోదనాలాపాలు మొదలెట్టేశారు.

ఇద్దరు డాక్టర్ల వైద్య ప్రక్రియవల్ల నైతేనేమి, గడచిన ఇరవైనాలుగు గంటల నుంచీ ఎడతెగకుండా చెలరేగుతున్న అలజడి వల్లనైతేనేమి తెల్లవారేసరికి మృత్యుదేవత వెనుకంజ వేసిన సూచనలు కనిపించాయి - కోదండం కళ్ళు తెరిచాడు!

విప్పారిన కోదండం కళ్ళల్లో నుంచీ బయల్వెడిన చూపుల్లో నాకేదో కొత్తదనం గోచరించింది. ఆ చూపుల్లో నిస్సహాయత తొంగిచూస్తోంది. దైన్యభావం ప్రతిబింబిస్తోంది. అగాధంలో నిల్చుని ఆకాశంవైపు చూస్తున్నవాడి చూపులెలా వుంటాయో కోదండం చూపులలా వున్నాయి!

* * *

నిన్న మొన్ననే జరిగినట్టున్నా పై సంఘటన అయిదేళ్ళనాటిది. అది జరిగిన రెండు మూడు మాసాలకే కోదండం మరొక వూరికి బదిలీ అయిపోయాడు. కానీ అతడు మా వూరిపాలిటికి అత్తిపువ్వయి పోలేదు. అప్పుడప్పుడూ వస్తుండేవాడు. తరచుగా జవాబు వ్రాస్తుండేవాడు. ఒకసారి ఏదో పనిమీద నేను కోదండం ఉద్యోగం చేస్తున్న వూరికి వెళ్ళడం తటస్థించింది. పని పూర్తికాగానే తిరిగిరావాలనే అనుకున్నాను. అంతలో కోదండం కనిపించాడు. కనిపించినవాడు ఒకపూట భోజనం చేయకుండా వెళ్ళడానికి వీల్లేదంటూ ఇంటికి తీసుకెళ్ళాడు.

లోపల కోదండం భార్య వంటచేస్తోంది. కోదండం నన్ను కూర్చోబెట్టి ఏవో సామానులకోసం అంగడికి వెళ్ళాడు.

ఆ అలమారలోనుంచి ఓ పుస్తకం తీసుకుని కుర్చీ కిటికీ దగ్గరకు లాక్కున్నాను. కూర్చోబోతుండగా గదిగోడకు వ్రేలాడుతూ నాలుగైదు ఛాయాచిత్రాలు కనిపించాయి. ఆశ్చర్యమేమిటంటే ఏ చిత్రంలోనూ కోదండం ఒంటరిగా కనిపించడం లేదు. ఒక ఫోటోలో అతడు బంధువులలో కలిసి కూర్చున్నాడు. వేరొక ఫోటోలో మిత్రబృంద పరివేష్టితుడు. ఇంకొక చిత్రంలో సిగ్గుతో తలవంచుకున్న పెళ్ళికూతురు సరసన మందహాసాలంకృత ముఖారవిందంతో ఠీవిగా నిల్చున్న పెళ్ళికొడుకు!

ఏదో వెలితి పరిహరింపబడిన తర్వాత కోదండం పూర్ణమానవుడైనట్లుగా ఓ ఊహ కలిగింది నాకు. తన కోసమంటూ ప్రత్యేకంగా ఓ స్వర్గాన్ని నిర్మించుకోగలగడం ఒక్క త్రిశంకుడికి మాత్రమే చెల్లింది. ఆ త్రిశంకుడైనా తన ప్రత్యేక స్వర్గంలో ఏ మాత్రంగా సుఖించి వుంటాడో మనకు తెలియదు. ఎలాగైతేనేం - కోదండం మళ్ళీ మనుషుల్లో పడ్డాడు. అంతేచాలు!

♦ కృష్ణాపత్రిక స్వర్ణోత్సవ సంచిక - 1960 ♦